
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 7 నవంబరు 2025 | 3





మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 150 సంఖ్యలో ఒదిగిన విద్యార్థులు

వందేమాతరం
సమరనినాదం

జాతీయ గీతానికి 150 ఏళ్లు
నేడు జిల్లా అంతటా వందేమాతరం
గీతాలాపనకు సన్నద్ధం

4




ఆకాశం మేఘావృతం కావడంతో పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఆరబోసిన ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు, కూలీలు, ధాన్యాన్ని బస్తాల్లో నింపి ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

మారుతున్న వాతావరణంతో
మళ్లీ కలవరం

- తెల్లవారుజామున చినుకులు
- సాయంత్రం వరకూ ఎండ, మబ్బులు
- ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు
- పంట రక్షణ కోసం పాట్లు

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితులు మళ్లీ రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమై చినుకులు పడుతుండడంతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏలేరు, పీబీసీ ఆయకట్టులో ముందుగా వరి నాట్లు వేసిన ప్రాంతాల్లో మాసూళ్ల ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇదే ఇప్పుడు రైతులను కలవరానికి గురిచేస్తోంది. రెండు రోజులుగా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో కోతకు సిద్ధమైన వరి పంటను వరికోత యంత్రాల సహాయంతో కోసి మాసూళ్లు నిర్వహిస్తున్నారు. ధాన్యం ఆరబెట్టిన తర్వాత విక్రయిద్దామని భావించిన రైతులు పిఠాపురం-గొల్లప్రోలు ప్రాంతాల్లోని 216వ జాతీయ రహదారి వెంబడి, ఇతర ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టారు. అయితే బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున జల్లులు పడ్డాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం ఎండ కాసినా ఆకస్మికంగా వాతావరణం మారి మేఘావృతమై వర్షం కురిసే సూచనలు కనిపించాయి. దీనితో రైతులు ఆరబోసిన ధాన్యం రాశులను ట్రాక్టర్లపై మిల్లులకు తరలిస్తున్నారు. మిగిలిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, బరకాలు కప్పుతున్నారు. ఇప్పటికే తుఫాన్, ఏలేరు వరదలతో నష్టపోయిన వరి రైతులకు ఇప్పుడు క్షణక్షణానికి మారుతున్న వాతావరణం కలవరపెడుతోంది. వర్షాల బారిన పడకుండా ఉండేందుకు వరికోత యంత్రాలతో మాసూళ్ల పూర్తిచేయాలని రైతులు భావిస్తున్నారు.



తూర్పోదయం!
సరికొత్తగా తూర్పుగోదావరి..?

2022లో పునర్విభజన

2022లో జిల్లాల పునర్విభజన జరిగిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం హడావుడిగా పార్లమెంట్ పరిధిని జిల్లాగా నిర్ణయిస్తూ జిల్లాల పునర్విభజన చేసేసింది. అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను మూడు ముక్కలు చేసి తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ జిల్లాలుగా విభజించింది. కొత్త తూర్పుగోదావరి జిల్లాగా రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లను కలిపి ఏర్పాటు చేసింది. నాడు మండపేట నియోజకవర్గాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కలపడాన్ని అక్కడ ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకించారు. ఎందుకంటే బొమ్మూరులో ఉన్న జిల్లా కలెక్టరేట్ కొద్ది దూరంలో ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆలోచించి మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపడానికి నిర్ణయించింది. దీంతో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు మూడు తూర్పుగోదావరి జిల్లాలో కలవనున్నాయి. మండపేట, రంపచోడవరం నియోజకవర్గాలు విలీనమైతే 9 నియోజకవర్గాలతో తూర్పుగోదావరి పెద్ద జిల్లా కానుంది. మండపేట నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రంపచోడవరం విషయంలో 10న క్లారిటీ రానుంది.

తూర్పుగోదావరి అతి పెద్ద జిల్లాగా ఆవిర్భవించనుంది.. జిల్లాకు కొత్త స్వరూపం రానుంది.. సరిహద్దులు మారనున్నాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే పశ్చిమలో ఉన్న మూడు నియోజక వర్గాలు విలీనం అయ్యాయి.మరో రెండు నియోజకవర్గాలు తూర్పున విలీనమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తూర్పున నియోజ కవర్గాల సంఖ్య 9కి చేరనుంది. మంత్రుల కమిటీ సూచనలు అమలైతే అతి పెద్ద జిల్లాగానూ ఆవిర్భవించనుంది.

- మారనున్న జిల్లా స్వరూపం
- మండపేట నియోజకవర్గం విలీనం
- రంపచోడవరం విలీనమా.. ప్రత్యేక అథార్టీనా
- ఆ రెండూ విలీనమైతేనే 9 నియోజకవర్గాలు
- 10న కేబినెట్‌లో నిర్ణయం
- డిసెంబర్ 31కి ముందే ప్రక్రియ పూర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం, ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గం కలిసే అవకాశాలపై మంత్రుల కమిటీ చర్చించిన సంగతి తెలిసిందే. ఈనెల 10వ తేదీన అమరావతిలో జరిగే మంత్రివర్గ సమావేశంలో వీటిపై పూర్తి స్పష్టత రానుంది. మొత్తం ప్రక్రియ ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపు పూర్తి కావాల్సి ఉంది. 2026 జనవరిలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ఆరంభం కానుంది. ఈలోపే జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ నేప థ్యంలో 10వ తేదీన కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్న తర్వాత జిల్లాల పునర్విభజన ప్రకటన వెలువడే అవకాశముంది. దాని తర్వాతే గెజిట్ జారీ చేస్తారు.



ఇలా చేయండి : రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో విలీనం చేయాలని ప్రదర్శన

కోనసీమ వద్దు.. కాకినాడ ముద్దు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రపురంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిలపక్ష జేఏసీ డిమాండ్‌కు మద్దతుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం బంద్ పాటించారు. వర్తక వాణిజ్య, విద్యా సంస్థలు, బార్ అసోసియేషన్ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. రాజగోపాల్ సెంటర్ నుంచి జీవిత బీమా కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. కోనసీమ వద్దు, కాకినాడ ముద్దు అంటూ నినాదాలు చేశారు. 52 పంచాయతీలు, పురపాలక సంఘం రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలని తీర్మానించాయని జేఏసీ నాయకులు అన్నారు. జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో కన్వీనర్ బి.సిద్ధు, చాంబర్ నాయకులు పసుపులేటి సత్తిబాబు, బార్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, గాదంశెట్టి శ్రీధర్, గొల్లపల్లి కృష్ణ, కౌన్సిలరు అంకం శ్రీను, టీడీపీ నాయకులు నారపురెడ్డి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఇలా...

ఏజెన్సీ పూర్వపు తూర్పుగోదావరి జిల్లాలోనే ఉండేది.2022లో జిల్లాల పునర్విభజన తర్వాత అల్లూరి సీతారామరాజు పేరిట ఏర్పడిన పాడేరు జిల్లాలోని రంపచోడవరం నియోజకవర్గంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాన్ని కలిపారు. 200 కిలోమీటర్ల దూరంలోని పాడేరు కలెక్టరేట్ పరిధిలోకి తేవడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు పోలవరం ముంపు ప్రాంతాలను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కొందరు లేదా, తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కొందరు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రుల ఉప కమిటీ ఇక్కడి పరిస్థితులపై సమీక్షించింది. పోలవరం ముంపు మండలాలు, ఏజెన్సీని ప్రత్యేక అథార్టీగా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన చేశారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేసే అంశంపైనా చర్చించారు. ఏలూరు జిల్లాలో ఉన్న పోలవరం ప్రాజె క్టుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మండలాల మాటేమిటి..

2022లో జిల్లాల పునర్విభజన లోక్‌సభ స్థానం యూనిట్‌గా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా చాలాచోట్ల ఈ నిబంధన ఉల్లంఘించింది. దీంతో కొన్ని మండలాల పరిధిలో సమస్యలు నెలకొన్నాయి. గోపాలపురం నియోజకవర్గం పరిధిలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలు తూర్పుగోదావరి జిల్లాలో.. చిన వెంకన్న ఆలయం ఉన్న ద్వారకా తిరుమల ఏలూరు జిల్లాలో కలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోని గోకవరం మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలిపారు. అనపర్తి నియోజకవర్గంలోని పెదపూడిని కాకినాడ జిల్లాలో కలిపారు. ఆయా మండలాల ప్రజల సమస్యలు పెరిగాయి.. ఎమ్మెల్యేలు, ఎంపీ వంటి ప్రజాప్రతినిధులు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు.. కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు వేరే జిల్లాలకు చెందిన వారు. తూర్పు కలెక్టరేట్‌తో వీరి సం బంధాలు లేకుండాపోయాయి. వీటిపై ప్రస్తుత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



కాకినాడ కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు

జీతాలు పెంచాలని కోరుతూ
ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ల ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల జీతాలు పెంచాలని ఏపీ స్టేట్ ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు రామచంద్రయ్య, మధు మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా జీతాలు పెంచలేదని, కుటుంబాలను పోషించుకోవడానికి అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో సంఘం ప్రతినిధులు రమణ, రవి, హరి, రామంజనేయులు, వెంకటరమణారెడ్డి, కూర్మారావు, పద్మనాభం, సోమేశ్వరరావు, నరసింహాచారి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు అధికారులు సన్నద్ధం కావాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్) ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని, పూర్తి సన్నద్ధతతో ఉండాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడలో తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని కీలక సెక్షన్లు, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రాధాన్యత, గత ఎస్ఐఆర్, సమగ్ర సవరణలో భాగస్వామ్యపక్షాలు, బూత్ లెవెల్ అధికారి, బూత్ లెవెల్ ఏజెంటు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల పాత్ర, ఎన్యూమరేషన్ ఫారాలు, ఇంటింటి సందర్శన గురించి సీఈవో వివేక్‌యాదవ్ వివరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ సన్నద్ధతలో భాగంగా స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియలో ముఖ్యమైన దశలపై అధికారులు పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. కాకినాడ జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎపిక్ కార్డుల జారీ అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. కాన్ప హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కాకినాడ కార్పొరేషన్ ఎఫ్ఏసీ కమిషనరు సుధాకర్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు జగన్నాథం పాల్గొన్నారు.

లిక్కర్ సిండికేట్‌లో ఇరుక్కున్న అధికారులపై చర్యలు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 2012-13 మధ్య కాలంలో లిక్కర్ సిండికేట్‌తో కలిసి కుమ్మక్కైన నేపథ్యంలో ఇద్దరు ఉద్యోగులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందులో భాగంగా అప్పట్లో కాకినాడ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎన్.వెంకటరమణకు ఒక యాన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇదే కేసులో ఉన్న పూర్వపు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు మూడు శాతం పెన్షన్ శాశ్వతంగా నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

కూరగాయాలు!

- ఆకాశాన్నంటుతున్న కాయగూరలు
- తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలు
- కార్తీకం, మాలధారుల సమయంలో డిమాండ్
- రెండు నెలలు ఇంతే

కాయగూరల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కార్తీకమాసం, మాలధారులు అధికంగా ఉండే సమయంలో పెరిగిన ధరలు తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టంతో మరింత అధికమయ్యాయి. సంక్రాంతి వరకు దాదాపు ఇదే పరిస్థితి ఉండవచ్చునని చెప్తున్నారు. తుఫాన్ ప్రభావంతో కాయగూరల పంటలకు నష్టం వాటిల్లడంతో వాటి ధరలు గణనీయంగా పెరిగాయి. కాయగూరలు కొనేందుకు వచ్చిన వారు పెరిగిన ధరలను చూసి షాక్‌కు గురయ్యారు. కార్తీక మాసంలో సాధారణంగానే కాయగూరలకు అధికంగా డిమాండ్ ఉంటుంది. కార్తీక మాసం నెల రోజులు ఎక్కువ మంది మాంసాహారం తినరు. వీరితోపాటు అయ్యప్ప, శివ, దత్త, కనకదుర్గ, సత్యదేవ మాలధారులు ఈ సమయంలో అధికంగా ఉంటారు. దీంతో సహజంగానే కాయగూరలు ధరలు అధికంగా ఉంటాయి. ఇదే సమయంలో తుఫాన్‌కు భారీ గాలులు వీయడం, వర్షం కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో కాయగూరలు రోజురోజుకీ అధికమవుతున్నాయి.

పది రోజుల వ్యవధిలోనే

కాకినాడ జిల్లాలో కాయగూరలు ధరలు పది రోజుల వ్యవధిలోనే పెరిగాయి. కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, తుని, ఏలేశ్వరం పట్టణాలు, అన్ని మండలాల్లోని మార్కెట్లల్లో ఇదే పరిస్థితి ఉంది. రైతుబజార్లల్లో కొంతమేర తక్కువగా ఉన్నా అది అత్యంత స్వల్పంగానే ఉంది.

సంక్రాంతి వరకు ఇదే పరిస్థితి!

కాయగూరల ధరలు సంక్రాంతి వరకు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాకినాడ జిల్లాలోని పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, తుని, గండేపల్లి, కోటనందూరు మండలాలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాయగూరలు పండించే ప్రాంతాల్లో పంటలకు తుఫాన్ కారణంగా తీవ్ర నష్టం జరిగింది. పలుచోట్ల మొక్కలు విరిగిపోవడంతోపాటు పూత రాలిపోయింది. రాష్ట్రంలో కాయగూరలు అధికంగా పండించే ప్రాంతాల్లోనూ పంట దెబ్బతిందని వ్యాపారులు చెప్తున్నారు. దీంతో మరో రెండు నెలలు వరకు ధరలు అధికంగానే ఉంటాయన్నారు. చిక్కుళ్లు, క్యాలీఫ్లవర్, క్యాబేజీ తదితర రకాల ధరల కొంతవరకు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. కార్తీక మాసం, మాలధారులు అధికంగా ఉండే సమయం కావడంతో కాయగూరలకు ఇదే డిమాండ్ ఉంటుంది. కాగా ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో కాయగూరలకు బదులుగా పన్నీరు, వెజ్ చికెన్, వెజ్ మటన్, మష్రూమ్స్, పుణు కులు తదితర రకాలతో కూరలను అధికంగా పెడుతున్నారు.

రకం (కిలో) ధర	గతంలో	ప్రస్తుతం
ఉల్లిపాయలు	18-22	25-32
వంకాయలు	40	60-80
బంగాళాదుంపలు	25	30-38
బీరకాయలు	40	50-65
టమాటా	28-30	37-40
దొండకాయలు	30-35	45-60
బెండకాయలు	30	40-58
బొబ్బర చిక్కుళ్లు	30	40-65
బీట్రూట్, క్యారెట్	40	55-75
పచ్చిమిర్చి	40	60-70
అల్లం	70	80-100
చేమదుంపలు	40	52
చిక్కుడు పిక్కలు	200-400	650
దేశవాళీ చిక్కుడుకాయలు	100-120	160
నిమ్మకాయలు	40	60

ఇవేం ధరలో..

కార్తీక మాసంలో అధికంగా అమ్ముడయ్యే చిక్కుడు పిక్కలు, చిక్కుడుకాయలు ధరలు షాక్ ఇస్తున్నాయి. సీజను ప్రారంభంలో చిక్కుడు పిక్కలు కిలో రూ.200 నుంచి రూ.400 వరకు ఉంటుంది. ఈ సారి అది రూ.500 ఉండగా, ఆదివారం రూ.600-650కి పెరిగింది. దీంతో కొనేవారు వెనక్కి వెళ్లిపోతున్నారు. దేశవాళీ చిక్కుడుకాయలు సాధారణంగా కిలో రూ.100లోపు ఉంటుంది. ప్రస్తుత ధర. రూ.160. ఆకాకర కాయలు కిలో రూ. 80-100 నుంచి రూ.120-140, అరటికాయ ఒకటి రూ.5 నుంచి రూ.10, ఆనబకాయ రూ.20-30 నుంచి రూ.25-40, కొత్తిమీర కట్ట రూ.20 నుంచి రూ.30, క్యాలీఫ్లవర్ సైజును బట్టి రూ.25-50కి పెరిగాయి.

పిఠాపురం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ 5

'జిల్లా క్రీడా మైదానంలో రన్నింగ్ ప్రాక్టీస్‌కు అనుమతి ఇవ్వాలి'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన తాను రన్నింగ్ ప్రాక్టీస్ చేసుకునేందుకు జిల్లా క్రీడా మైదానంలో అనుమతి ఇవ్వాలని స్పోర్ట్స్‌మెన్ పెదపాటి రామకృష్ణ కోరారు. గురువారం ఆయన ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను 35 సంవత్సరాలుగా అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్‌లో అనేక పతకాలు సాధించనన్నారు. జిల్లా క్రీడా మైదానంలో రన్నింగ్ ప్రాక్టీస్‌కు వెళితే ఒక వ్యక్తి అడ్డుకున్నాడని, అనుమతి కోసం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం ఇచ్చానన్నారు.

పిఠాపురంలో కల్తీ నెయ్యి కలకలం
● 21 డబ్బాల్లో కొవ్వు, కల్తీ నెయ్యి స్వాధీనం
● పశువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపణ
5




డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో వందేమాతరం, 150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం గీతాలాపన రిహార్సల్స్ నిర్వహిస్తున్న విద్యార్థులు



వందేమాతరం

సమర నినాదం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బెంగాలీ కవి బంకించంద్ర చటోపాధ్యాయ వందేమాతర గీతాన్ని సంస్కృతం, బెంగాలీ భాషల్లో 1875లో రచించారు. దీనిని తొలుత ఆయన 1882లో రచించిన నవల ఆనంద మఠంలో ప్రచురించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ పాటను రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి 1896లో కోల్‌కతాలో జరిగిన భారతీయ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడారు. సుమారు మూడు నిమిషాలకు పైగా నిడివితో పూర్తిగా ఐదు పాదాలు ఉండే ఈ వందేమాతరం గీతంలో కేవలం రెండు చరణాలనే ఇప్పటి వరకు పాడుతున్నాం. మిగిలిన పాదాలు అంత ప్రాచుర్యంలో లేవు. అయితే ఆ మిగిలిన మూడు పాదాలను కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నానికి భారతీయ జనతా పార్టీ శ్రీకారం చుట్టింది. అందరితోనూ వందేమాతరాన్ని పూర్తిగా పాడించేందుకు సిద్ధమైంది.

వందేమాతర గీతం శుక్రవారం నాటికి 150 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా "స్వరాజ్యం-స్వదేశీ-సమైక్యత" నినాదంతో బీజేపీ రాష్ట్ర శాఖ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తోంది. ఐదు చరణాలతో మూడు నిమిషాల నిడివి ఉన్న వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించేలా ఆ పార్టీ కాకినాడ జిల్లా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. కాకినాడ గాంధీనగర్ పార్కులో సుమారు పదివేల మంది విద్యార్థులతో గీతాన్ని పాడించేందుకు సన్నాహాలు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఏడు గంటల మధ్య ఈ కార్యక్రమం జరగనుంది.



వందేమాతరం గీతం అప్పట్లో రాజమహేంద్రవరం యువతను తొలిసారిగా ఉద్యమాలవైపు నడిపించిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. 1907 ఫిబ్రవరిలో స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి గాడిచర్ల హరిసర్వోత్తమరావు నేతృత్వంలో ఓ బృందం ఉద్యమించింది. ఈ పరిణామాన్ని అప్పటి ప్రిన్సిపాల్ హంటర్ సహించలేక విద్యార్థులకు హెచ్చరికగా హరిసర్వోత్తమ రావును కాలేజీ నుంచి బహిష్కరించాడని, అయినా సరే ఎవరూ బెదరకుండా ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు.



ప్రస్తుతం వాడుకలో ఉన్న వందేమాతరం

వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం
వందేమాతరం.. వందేమాతరం

శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం
పుల్లకుసుమిత ద్రుమదుల శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం
వందేమాతరం.. వందేమాతరం

(వాస్తవానికి ఇక్కడ వరకే అందరూ వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, దేశ భక్తిని పెంపొందించే కార్యక్రమాల్లో, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లోనూ ఈ రెండు పాదాలతోనే సరిపెడుతున్నారు. మిగిలిన మూడు చరణాల ప్రస్తావన లేదు)

కోటి కోటి కంఠ కలకల నినాదకరాలే
కోటి కోటి భుజైర్ ధృత కర కరవాలే
అబలా కేయనో మా ఏతో బలే..
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదలవారిణీం మాతరామ్
వందేమాతరం... వందేమాతరం

తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వం హి ప్రాణాః శరీరే
బాహుతే తుమి మా శక్తి హృదయే
తుమి మా భక్తి
తో మారయి ప్రతిమా గడి మందిరే మందిరే
వందేమాతరం... వందేమాతరం

త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ
నమామి త్వాం
నమామి కమలాం అమలాం అతులాం
సుజలాం సుఫలాం మాతరమ్
వందేమాతరం... వందేమాతరం

శ్యామలాం సరలాం సుస్మితాం భూషితాం
ధరణీం భరణీం మాతరం
వందేమాతరం...
వందేమాతరం...



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

కాకినాడలో నేడు సామూహిక గీతాలాపన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాన్ని బంకించంద్ర చటర్జీ జాతికి అందించి శుక్రవారానికి 150 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా చారిత్రక ప్రాధాన్యం కలిగిన కాకినాడ గాంధీనగర్ పార్కు వద్ద సంబరాలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పి.సురేష్ తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1923లో కాకినాడ గాంధీనగర్ పార్కులో కాంగ్రెస్ జాతీయ మహాసభలు జరిగాయని, వందేమాతరం ఆలపించమని విష్ణు దిగంబర్ పాలుస్కర్‌ను వేదికపైకి ఆహ్వానించారన్నారు. ఆయన గీతాలాపన చేస్తుండగా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ ఆలీ ఈ గీతం తమ మతానికి వ్యతిరేకంగా ఉందని అడ్డగించారన్నారు. ఆనాటి అవమానకర సంఘటనకు, చారిత్రక తప్పిదానికి వేదికగా నిలిచిన గాంధీనగర్ పార్కులోనే సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం గాంధీనగర్ పార్కు వద్ద జరిగే సామూహిక వందేమాతర సామూహిక గీతాలాపన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్‌దాస్ అగర్వాల్ హాజరవుతారని తెలిపారు. దేశభక్తులు, నగరవాసులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ, రమేష్, సురేష్, జ్యోతుల రాజేష్, యెనిమిరెడ్డి మాల కొండయ్య, గౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో తూర్పు నగరవనం


నగరవనం ఏర్పాటు కానున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

- 125 ఎకరాల భూమిలో ఏర్పాటు
- వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి
- తూర్పు అటవీ అధికారి ప్రభాకరరావు

దివాన్‌చెరువు, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకుని దివాన్‌చెరువు తూర్పు అటవీ ప్రాంతంలో నగరవనం ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా అటవీ అధికారి వి.ప్రభాకరరావు తెలిపారు. ఈ నగరవనం ఏర్పాటు కానున్న దివాన్‌చెరువు నుంచి గైట్ కళాశాల మధ్య గల అటవీ ప్రాంతాన్ని హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్కిటెక్ట్ గౌరీశంకర్‌తో కలిసి డీఎఫ్‌వో ప్రభాకరరావు గురువారం క్షేత్రపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివాన్‌చెరువు తూర్పు అటవీ ప్రాంతంలో దాదాపు 125 ఎకరాల అటవీ భూమిలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నగరవనం మంజూరు అయ్యిందని తెలిపారు. ప్రస్తుతం అటవీశాఖ ఆధ్వర్యంలో సందర్శకులకు ఆరోగ్యం, అహ్లాదం తోబాటు అవగాహనను పంచుతున్న లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కరవనం కంటే మరింత ఆకర్షణీయంగా ఈ నగరవనాన్ని తీర్చిదిద్దనున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దీనిని పూర్తిచేస్తామని అన్నారు. కాగా ప్రస్తుతం లాలాచెరువు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గోదావరి మహాపుష్కరవనం దాదాపు పదేళ్ల క్రితం గోదావరి మహాపుష్కరాలు సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా 2015లో శంకుస్థాపన చేయగా 2016 నవంబరు 19న ప్రారంభించారని ఈ సందర్భంగా డీఎఫ్‌వో గుర్తుచేశారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందీశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచనల మేరకు అంతర్జాతీయ ప్రమాణాలున్న జూసఫారీని ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ ఒ.దావీదురాజు, డీఆర్వో పద్మావతి, బీట్ అధికారి గళ్లా రంగారావు పాల్గొన్నారు.

నేడు అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ జూడో చాంపియన్ షిప్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 69వ రాష్ట్ర అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూడో ఛాంపియన్ షిప్ అండర్ 17 బాల, బాలికలు పోటీలు గురువారం కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో జరగనున్నాయి. ఈ పోటీలు నవంబరు 7 నుంచి 9 వరకు జరుగుతాయని తెలిపారు. పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ సగిలి షాన్ మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు పాల్గొనున్నారు. అండర్ 14, 17 నిర్వహణ కార్యదర్శి, పాఠశాల క్రీడా సమాఖ్య, కాకినాడ జిల్లా, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.సుధా రాణి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు క్రీడాలను పరిరక్షించునున్నారు.

రోలర్ స్కేటింగ్‌లో హనీఫాకు గోల్డ్‌మెడల్

ఇతర విభాగాల్లో మరో నాలుగు పతకాలు


హనీఫాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీలు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో జూనియర్ ఇంటర్ (బైపీసీ) విద్యార్థిని ఎండీ హనీఫా మెహ్నాజ్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఐదు పతకాలను కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో జరిగిన రోలర్ స్కేటింగ్ మీట్‌లో 1000 మీటర్ల రేసులో స్వర్ణ పతకం, రోడ్ ల్యాప్, మిక్స్‌డ్ రిలే, 500 మీటర్ల రేసుల్లో వెండి పతకాలు, 500 +డి రేసులో కాంస్య పతకం సాధించిందని పేర్కొన్నారు. ఈ విజయాలతో హనీఫా డిసెంబరులో జరుగబోయే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు పీడీలు వై.సుధారాణి, ఎ.నాగులు అభినందించారు.

జేఎన్టీయూకే-స్కిల్ డిజైర్ అవగాహన ఒప్పందం


ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న రిజిస్ట్రార్, స్కిల్ డిజైర్ ప్రతినిధులు

జేఎన్టీయూకే, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ, హైదరాబాద్‌లోని స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. వీసీ సమావేశ హాలులో జరిగిన ఈ ఒప్పందం ద్వారా జేఎన్టీయూకే విద్యార్థులకు స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, స్కిల్ డిజైర్ ద్వారా కంప్యూటర్, ఐటీ స్కిల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తామన్నారు. వీసీ సమక్షంలో సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, స్కిల్ డిజైర్ సహ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ మార్చుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

షిప్ బిల్డింగ్ యార్డును సందర్శించిన బాషా


షిప్ బిల్డింగ్ యార్డును సందర్శిస్తున్న ఫెడరేషన్ చైర్మన్ బాషా

కాకినాడ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోర్టు ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఖలీఫతుల్లా బాషా(సెంట్రల్ గవర్నమెంట్ నామినేటెడ్) కాకినాడ పర్యటనలో భాగంగా గురువారం ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కలిశారు. పోర్టు సమస్యలపై కలిసి పనిచేసే విషయమై చర్చించారు.అనంతరం శాన్ మెరైన్ షిప్పింగ్ సంస్థ అధినేత అహ్మద్ ఆలీషాతో కలిసి షిప్ బిల్డింగ్‌యార్డ్‌ను సందర్శించారు. బాషా మాట్లాడుతూ ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి కృషి చేసిన ఆలీషాను అభినందించారు. పోర్టులో పనిచేస్తున్న వర్కర్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పోర్టుకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాషా వెంట ఏపీ ఆర్టీఐ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పప్పు దుర్గారమేష్, పలు సంస్థల ప్రతినిధులు ఎస్‌కే రఫీ, ఎస్‌కే ఇమామ్, హసన్ షరీఫ్, హబీబ్ బాషా ఉన్నారు.

10న అప్రెంటిస్, జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలలో వివిధ కంపెనీలలో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వం ఐటీఐలో ఈనెల 10న ఉదయం 9గంటలకు ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల వర్మ తెలిపారు. జిల్లాలో గల ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావలసిన అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి సెలెక్ట్ చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్, జెరాక్స్ కాపీలత పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న జేఎన్టీయూలో నిర్వహిస్తున్న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్, జాబ్ మేళాకు హాజరవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440408182 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కాకినాడ-సామర్లకోట ఆర్టీసీ బస్సుల రూట్ మళ్లింపు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి సామర్లకోట మధ్య రోడ్డు నిర్మాణ పనులు కారణంగా ఆర్టీసీ బస్సుల రూట్ మళ్లించినట్టు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంకాలం 5గంటల వరకు సామర్లకోట ముత్యాలమ్మ తల్లి గుడి నుంచి కాకినాడ వరకు రోడ్డు మూసివేయడంతో ఆర్ అండ్ బీ అధికారులు, పోలీస్ డిపార్ట్మెంట్ సూచనల మేరకు ఆ రూట్‌లో వెళ్లే బస్సులన్నీ కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి ఏపీఎస్పీ, సర్పవరం జంక్షన్, ఏడీబీ రోడ్డు మీదుగా సామర్లకోట వెళతాయని డిపో మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు.

వెంకన్న ఆలయ వంట నౌకరి భూముల స్వాధీనం


వంట నౌకరి భూముల స్వాధీన బోర్డు పెడుతున్న అధికారులు

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన వంట నౌకరి భూములను జిల్లా అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వాడపల్లిలో 27/2 సర్వే నెంబరులో 2.60 ఎకరాలు, 48/4ఏ సర్వే నెంబరులో 4.60 ఎకరాల భూమిని మార్గపురి జగన్నాథ వాసుదేవస్వామి, శేషప్రకాశ్, నరసింహకుమార్‌లకు వంట నౌకరీ భూములుగా గతంలో అందించారు. అయితే సంబంధిత వ్యక్తులు వంట నౌకరీ సరిగ్గా చేయకపోవడంతో సీసీఎల్‌సీ ఉత్తర్వులు మేరకు కోట్లాది రూపాయలు విలువైన భూములను దేవస్థానం స్వాధీనం చేసుకుంది. హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు మేరకు దేవదాయ శాఖ అధికారులు రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో వెళ్లి ఆ భూములను స్వాధీనం చేసుకున్నట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ భూములలోకి ప్రవేశించి ఎర్రజెండాలు పాతి స్వామివారికి చెందిన భూములుగా బోర్డులు పెట్టి స్వాధీన ప్రక్రియను పూర్తిచేశారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, రెవెన్యూ, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎన్‌సీసీ అధికారి

పెద్దాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను గురువారం నిర్వహించారు. 18 ఆంధ్ర బెటాలియన్ కాకినాడ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అసిఫ్ మహమ్మద్ ఆదేశాల మేరకు 2025-26 శిక్షణా సంవత్సరానికి విద్యార్థులను ఎన్‌సీసీ సెలక్షన్ అధికారులు ఎంఎస్ రావు, శక్తివేల్, రానా, దిలీప్, మనీష్ ఎంపిక చేశారు. 11వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్‌లో పరుగు పోటీ, శరీర ధారుఢ్య పోటీ, మెడికల్ టెస్టులు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వసంత జగన్‌మోహన్, జూనియర్ డివిజన్ అసోసియేషన్ ఆఫీసర్ జాగ్రఫీ పీజీటీ ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కాకినాడ జిల్లా నైపుణ్యాధికారి(ఇన్‌చార్జి) వీడీజీ మురళి పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో రెండేళ్ల ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లమోలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. గరిష్ఠంగా 30 సంవత్సరాల వయస్సు, కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన వారికి రెండు సంవత్సరాల ఒప్పందం మేరకు నెలకి 2,600 నుంచి 2700 యూరోలు(రూ.2.60 నుంచి రూ.2.70 లక్షలు) వేతనం లభిస్తుందని తెలిపారు. వసతి, అరైవల్ సహాయం వంటి సౌకర్యాలు అందిస్తారని తెలిపారు. అభ్యర్థులకు జర్మన్ భాషలో 12, 14 వారాల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. శిక్షణ ఫీజు 1.15 లక్షలు మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నవంబరు 15 లోగా సంబంధిత వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 99888 53335, 871265 5686, 87901 18349, నెంబర్లను సంప్రదించాలని మురళి తెలిపారు.

మురమళ్లలో ఆర్టీసీ బస్సును అడ్డుకున్న యువకులు

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ఐ.పోలవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం డిపో నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును మురమళ్ల మాణిక్యాంబ గుడి వద్ద బుధవారం రాత్రి కొందరు యువకులు అడ్డుకున్నారు. మురమళ్ల వెళ్లేందుకు ఒక మహిళ అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వద్ద బస్సు ఎక్కింది. ఉచిత బస్సు ప్రయాణం నిమిత్తం ఆ మహిళ ఆధార్ కార్డు చూపించే ప్రయత్నం చేస్తుండగా అనాతవరం వద్ద నిర్మానుష్య ప్రదేశంలో కండక్టర్ ఆమెను దింపివేశారు. దీంతో ఆ మహిళ తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారమందించింది. దీనితో కొందరు యువకులు మురమళ్ల మాణిక్యాంబ ఆలయం వద్ద బస్సును అడ్డుకున్నారు. దీనితో యువకులకు, ఆర్టీసీ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. గందరగోళం నెలకొంది. ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సిబ్బందితో వచ్చి ఇరు వర్గాలను వారించారు. తప్పు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలి గాని బస్సును అడ్డుకోవడం సరికాదని సూచించారు. పోలీసులు ఆర్టీసీ బస్సును అక్కడి నుంచి పంపించడంతో వివాదం సద్దుమణిగింది.

పిఠాపురంలో కల్తీ నెయ్యి కలకలం

పిఠాపురంలో మరోసారి కల్తీ నెయ్యి కలకలం రేగింది. పశువుల కొవ్వు ఉపయోగించి నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపిస్తూ విశ్వహైందవ పరిషత్ ఆందోళనకు దిగడంతో అధికారులు స్పందించారు. 21డబ్బాల్లో ఉన్న పశువుల కొవ్వును సీజ్ చేశారు. గతంలో ఒకసారి ఇదే ప్రాంతాల్లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు రావడంతో అధికారులు కేసు నమోదుచేసి సరుకును స్వాధీనం చేసుకున్నారు.

● 21 డబ్బాల్లో కొవ్వు, కల్తీ నెయ్యి స్వాధీనం

● పశువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని ఆరోపణ



పిఠాపురంలో అధికారులు స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యి, పశువుల కొవ్వు ఉన్న డబ్బాలు, విచారణ చేస్తున్న అధికారులు

పిఠాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మాధవనగర్‌లోని ఒక ఇంటిలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారనే సమాచారంతో విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశువుల కొవ్వు వినియోగించి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారని, దీనినే పవిత్రమైన ఆవు నెయ్యిగా విక్రయాలు జరుపుతూ భక్తులను మోసగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలోనే ఇదే రీతిలో కల్తీ నెయ్యి తయారు చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులు చేరుకుని ఆ ఇంటిని సీజ్ చేశారు. గురువారం సాయంత్రం పిఠాపురం పట్టణ ఎస్‌ఐ మణికుమార్, ఆర్‌ఐ వెంకటేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర అప్పారావు అక్కడకు చేరుకున్నారు. కల్తీ నెయ్యి తయారీకి వినియోగిస్తున్న 21 డబ్బాల్లోని జంతువుల కొవ్వుతోపాటు అక్కడ ఉన్న కల్తీ నెయ్యిను స్వాధీనం చేసుకున్నారు. శాంపిల్స్ సేకరించి ఫుడ్ కంట్రోల్ అధికారులకు పంపారు. శాంపిల్స్ సేకరించిన తర్వాత మిగిలిన జంతువుల కొవ్వును పూడ్చివేస్తామని అధికారులు తెలిపారు. తరచూ కల్తీ నెయ్యి తయారీ ఆరోపణలు వస్తున్నా నియంత్రణ గురించి అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తాను పలుమార్లు ఫిర్యాదు చేస్తేనేకానీ అధికారులు స్పందించలేదని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుంతలలో అదుపుతప్పి పడిపోవడంతో

లారీ ఢీకొని కూరగాయల వ్యాపారి మృతి



మృతిచెందిన గొల్లబ్బాయి

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-కాకినాడ ప్రధాన రోడ్డులో పెద్దపెద్ద గుంతలు కారణంగా గురువారం గోవిందరాజు పాలెంనకు చెందిన కూరగాయల వ్యాపారి తన టీవీఎస్ మోపెడ్ నుంచి రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న లారీ చక్రాల కిందపడి ఆ వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం వెంకటకృష్ణరాయపురం మాధవపట్నం మధ్య చోటుచేసుకుంది. సామర్లకోట ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు సిబ్బందితో ప్రమాదానికి గురైన వాహనాలను, మృతదేహాలను రోడ్డు పక్కకు తప్పించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతుడు పిఠాపురం నియోజకవర్గం గోవిందరాజుపాలెంనకు చెందిన సిరికిపల్లి గొల్లబ్బాయిగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతి పేదరికంతో రోజూ కాకినాడ వెళ్లి కూరగాయలు ఇంటింటా అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తాడని బంధువులు తెలిపారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పి.గన్నవరం అక్విడెక్టుకు

రూ.49.30 లక్షలతో మరమ్మతు

● 40 రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించాలి

● ఇరిగేషన్ డీఈ రవిప్రసాద్‌రాజు



పాత అక్విడెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ రవిప్రసాద్‌రాజు

పి.గన్నవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం కొత్తఅక్విడెక్టుపై జాయింట్‌ల మరమ్మతుల నిమిత్తం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవతో సీఎస్ఆర్ నిధులు రూ.49.30లక్షలు మంజూరయ్యాయని పి.గన్నవరం సబ్ డివిజన్ డీఈ రవిప్రసాద్ రాజు తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని త్వరలోనే పనులు మొదలుపెడతామని ఆయన తెలిపారు. స్థానిక నీటిసంఘ అధ్యక్షులతో కలిసి గురువారం ఆయన పాత అక్విడెక్టును పరిశీలించి అనంతరం మాట్లాడారు. అక్విడెక్టుపై జాయింట్‌లు పూర్తిస్థాయిలో పాడయ్యాయని వాటి మధ్య ఎక్స్‌ఫిన్‌షన్ జాయింట్‌లు ఏర్పాటు చేస్తారని చెప్పారు. 33చోట్ల ఏడున్నర మీటర్లు వెడల్పుతో కూడిన ఎక్స్‌ఫిన్‌షన్ జాయింట్‌లు అవసరమైనచోట ఇయరింగ్ కోట్లు ఏర్పాటు చేస్తారన్నారు. అలాగే ఫుట్‌పాత్‌కు మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పారు. అక్విడెక్టుపై పనిచేసే సమయంలో సుమారుగా 40 రోజులపాటు ట్రాఫిక్‌ను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా పాత అక్విడెక్టుపై నుంచి వాహనాలను మళ్లించే విధంగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పాత అక్విడెక్టు కెపాసిటీని సంబంధిత ఇంజనీర్లతో చర్చించి సామర్థ్యం మేరకు వాహనాల రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే భారీ వాహనాలను బొడసకుర్రువైపు మళ్లించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డైలీ బజారును, పాత అక్విడెక్టుపైన, ఇరువైపులా ఉన్న అడ్డంకులను తొలగించి వాహనాల దారి మళ్లిస్తామని చెప్పారు. అనంతరం కొత్త అక్విడెక్టుపై పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసకుంటామన్నారు. ఎక్స్‌ఫిన్‌షన్ జాయింట్‌లలో ఏర్పాటుచేసే ఇనుప రాడ్లను రెండు రకాలను పరిశీలిస్తున్నామని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఒక మోడల్‌ను సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. డీఈ వెంట పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, ఇనుకపూడి నీటిసంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు ఉన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్

● కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం పరిశీలన



పిఠాపురం నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుపై పరిశీలన జరుపుతున్న కేంద్ర, రాష్ట్ర అధికారులు

గొల్లప్రోలు రూరల్/కొత్తపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని చేనేత కార్మికుల నైపుణ్యాల పెంపుదల, అభివృద్ధి లక్ష్యంగా చేనేత క్లస్టర్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం బుధ, గురువారాల్లో పర్యటించింది. చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పిఠాపురం నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాజెక్టు మంజూరు చేయాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఇదే విషయంపై కేంద్ర చేనేత, జౌళిశాఖల మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో చేనేతరంగం అభివృద్ధికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మెగా షోరూం, డిజైనింగ్, డైయింగ్ యూనిట్ల ఏర్పాటు నిమిత్తం రూ.15కోట్లతో ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై చెన్నైలోని దక్షిణభారత వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ సి.ముత్తుస్వామి, విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌సాహూ, చేనేత-జౌళిశాఖ రాష్ట్ర ఏడీ వనజ, కాకినాడ జిల్లా ఏడీ కె.పెద్దిరాజు, ఢిల్లీబాబు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ డెవలప్‌మెంట్, వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, జాంథానీ చీరల ఉత్పత్తిదారుడు లొల్ల సత్తిపండు పరిశీలించారు. గొల్లప్రోలు నగర పంచాయతీతోపాటు తాటిపర్తి, చేబ్రోలు, చెందుర్తి, దుర్గాడ, కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప ఉప్పాడ, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించి చేనేత సొసైటీలు, వాటికి చెందిన స్థలాలు, కార్మికుల స్థితిగతులు, మగ్గాలను పరిశీలించారు. ఈ నివేదికను కేంద్రానికి పంపుతామని అధికారులు చెప్పారు.

ఇసుక స్టాక్ పాయింట్ల తనిఖీ

● రికార్డులు పరిశీలించిన మైనింగ్ ఏడీ

ఎటపాక, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం గుండాల జాతీయ రహదారి సమీపంలో ఉన్న రెండు ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్లను గురువారంజిల్లా మైనింగ్ ఏడీ ఆనంద్ తనిఖీ చేశారు. ఇసుక అమ్మకాలు నిర్వహిస్తున్న స్టాక్ పాయింట్-1లో స్టాక్ రికార్డును పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ఇసుక అమ్మకాలు చేశారు..? ఎంత ఇసుక నిల్వ ఉందనే దానిని పరిశీలించారు. గృహఅవసరాలకు వినియోగించు లబ్ధిదారులకు ఆధార్ స్థానికతలో అమ్మకాలు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ లో ఇసుక కొనుగోలు చేయకుండా, అనుమతులు లేకుండా స్టాక్ పాయింట్ వద్దకు వాహనాలను రానీయవద్దని తెలిపారు. తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాలకు ఇసుక లోడ్ చేయవద్దని, అలాంటి వాహనాలను స్టాక్‌పాయింట్ వద్దకు అనుమతించవద్దని సూచించారు. అనంతరం రాయనపేట, కన్నాయిగూడెం గ్రామాల్లో గోదావరినదీ ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో నాగమణి, తదితరులు ఉన్నారు.



స్టాక్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న మైనింగ్ ఏడీ

పెరికివలస ప్రత్యేక పంచాయతీ

ఏర్పాటుకు గ్రామసభ

● నూతన పంచాయతీలకు తీర్మానం

వై.రామవరం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలోని ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు కోసం మండలంలోని చింతలపూడి పంచాయతీ పెరికివలస గ్రామంలో గురువారం ఎంపీడీవో బాపన్నదొర గ్రామసభ నిర్వహించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతం గుర్తేడును ప్రత్యేక మండలంగా చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున నూతనంగా ఏర్పాటయ్యే గుర్తేడు మండలంలో 12 గ్రామాలతో చింతలపూడి పంచాయతీలోని పెరికివలస, పుట్టగండి, రచ్చవలస, దుమ్మదారవాడ, చింతవలస, కుంకుమామిడి బంద, కత్తిరాళ్ళు, పంచదారలంక, సీతలంక, నీలిపొలం, జమ్మనవీది, దుమ్మ నగడ్డ గ్రామాలతో నూతన పంచాయతీకి తీర్మానం చేశారు. ఎంపీపీ ఆనందరావు, వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ, ఉపసర్పంచ్ పల్లాల రాజుగోపాల్‌రెడ్డి, గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు, హౌసింగ్‌శాఖ నాగార్జున, ఉపాధి ఏపీవో స్వామి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.





పత్యేక పంచాయతీ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర, కొత్త పంచాయతీగా పెరికివలస పేరు అరిటాకుపై రాసిన గిరిజనులు

యథేచ్ఛగా ఏలేరు మట్టి తరలింపు

● ఏలేశ్వరం గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం

● పట్టించుకోని రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు



ఏలేశ్వరంలో ఏలేరు ప్రాజెక్టు సమీపంలో అక్రమంగా తవ్వేసిన మట్టి కొండలు

ఏలేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టు సమీపంలో ఉన్న మట్టికొండలను అక్రమార్కులు కొల్లగొట్టుకుంటూపోతున్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండా పగలు, రాత్రి తేడా లేకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో సుమారు 15 ట్రాక్టర్లతో తవ్వుకుంటూ పోతున్నా సంబంధిత ఏలేరు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ మట్టిని ఇళ్లు, దుకాణాల నిర్మాణంలో పునాదులకు ఇతర అవసరాలకు తరలించి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. రిజర్వాయర్ నుంచి వరద నీరు వచ్చే ప్రాంతానికి సమీపంలోనే మట్టి తవ్వకాలు జరగడంతో సానికంగా నివసించే ప్రజలు, పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిధమైన తవ్వకాలతో తమకు రక్షణలేకుండాపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఇలాగే తవ్వకుంటూపోతే ప్రాజెక్టు నుంచి వచ్చే వరద నీరుతో ఏలేశ్వరం పట్టణ, రూరల్ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఏలేరు అధికారులకు సమస్యను వివరించినావారు పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ట్రాక్టర్ మట్టి సుమారు రూ.3500నుంచి రూ.4500 వసూలు చేస్తూ అక్రమార్కులు లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. కాసుల కక్కుర్తితో ఏలేరు రక్షణ తమకేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడంతో పలు ఆరోపణలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇకనైనా ఏలేరు, రెవెన్యూ అధికారులు చొరవచూపి అక్రమంగా తవ్వుతున్న మట్టి తవ్వకాలపై అడ్డుకట్టు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

భీమేశ్వరాలయంలో వైభవంగా జ్వాలాతోరణం

దాక్షారామ,నవంబరు6(ఆంధ్రజ్యోతి):ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గురువారం జ్వాలాతోరణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.కృత్తిక నక్షత్రం రోజున స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. సాయంత్రం 8 గంటలకు స్వామి వారికి సర్వదేవాతా ఆహ్వానం, దూపసేవ నిర్వహించారు. అనంతరం ప్రదోషకాల పూజ జరిపారు. నేతి జ్యోతి కాంతిలో ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రదక్షిణం చేశారు. సప్తగోదావరి తీరంలో జ్వాలా తోరణం నిర్వహించారు. ఆలయ సహాయకమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

అంతర్వేది నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం





అంతర్వేదిలో విరాళం అందిస్తున్న కొత్తపల్లి రామకృష్ణ దంపతులు, అయినవిల్లిలో దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు, అన్నవరంలో ఏఈవో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు కడియం మండలం బుర్రిలంకకు చెందిన కొత్తపల్లి రామకృష్ణ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతకు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీవీ న్ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి అభినందించారు.

సత్యదేవ నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.1,00,016లు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ భరత్‌కుమార్, సాయిలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని అన్నదాన విభాగ ఏఈవో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో అన్న దాన విభాగ ఉద్యోగులు కంచిబొట్ల రాంబాబు, బండారు రమణ తదితరులున్నారు.

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం వియ్యారివారిమెరక గ్రామానికి చెందిన చింతా ఉమామహేశ్వరరావు-సావిత్రి దంపతులు కుటుంబ సమేతంగా గురువారం శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.100,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి కార్యనిర్వహణాధికారి అభినందించారు.

రూ.4లక్షల విలువైన డైమండ్ లాకెట్ అప్పగింత

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రూ.4లక్షలు విలువైన డైమండ్ లాకెట్‌ను పోగొట్టుకున్న బాధితురాలికి దొరికిన మహిళ అప్పగించి ఔదార్యాన్ని చాటుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలానికి చెందిన టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాస రెడ్డి తన భార్యతో ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి బుధవారంరాత్రి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆమె మెడలో రూ.4లక్షల విలువైన డైమండ్ లాకెట్ గుడిలో జారిపడిపోయింది. ఈ విషయం పక్కనే ఉన్న ర్యాలి అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు తెలియడంతో స్థానిక గ్రూపులలో బాధితురాలు పోగొట్టుకున్న విషయాన్ని పోస్ట్ చేశారు. అదే గ్రామానికి చెందిన ఇందుగుల కృష్ణవేణికి ఈ లాకెట్ దొరకడంతో అయ్యప్పభక్తులకు అందజేశారు. స్వాములందరూ లాకెట్ పోగొట్టుకున్న బాధితురాలు ఇంటికి వెళ్లి అప్పగించారు. వస్తువు దొరికిన కృష్ణవేణిని అందరూ అభినందించి నగదు బహుమతిని అందజేశారు.



పోగొట్టుకున్న బంగారు లాకెట్‌ను అప్పగించిన కృష్ణవేణికి నగదు పురస్కారం అందజేస్తున్న దృశ్యం



రక్తపు మడుగులో మృతుడు వడిశెల అప్పారావు (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

తనయుడి చేతిలో తండ్రి హతం

● చెల్లెలి వివాహంపై వివాదం

● కూరగాయల చాకుతో గొంతు కోసి హత్య

రాజానగరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చెల్లెలి వివాహ విషయమై తండ్రీకొడుకుల మధ్య తలెత్తిన ఘర్షణ తండ్రి వడిశెల అప్పారావు(47)కుమారుడు సాయికుమార్ చేతిలో హతమైన సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజమహేంద్రవరంరూరల్ మండలం తొర్రేడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ గురువారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న అప్పారావు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె ప్రశాంతికి అప్పారావు ధవళేశ్వరానికి చెందిన వ్యక్తితో పెళ్లి సంబంధం తీసుకొచ్చాడు. ఆ వ్యక్తితో ప్రశాంతి దగ్గరైంది. అయితే పెళ్లి కొడుకు తరుపు వారు కట్నం ఎక్కువ అడుగుతుండడంతో ప్రశాంతికి చూసిన పెండ్లి సంబంధం చేయడానికి తన దగ్గర అంత డబ్బు లేదు. ఈ మధ్యనే ఇళ్లు కట్టి కొద్దిగా అప్పుల్లో ఉన్నానని, మరో సంబంధం చూద్దామని భార్య, కుటుంబ సభ్యులతో కొద్ది రోజులుగా చెబుతూ వస్తున్నాడు. ఈ లోపులోనే ఇరు కుటుంబాల వారు దగ్గరయ్యారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ప్రశాంతి ఇంటికి ఆలస్యంగా రావడంతో తండ్రి దూషిస్తూ మాట్లాడాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రిని కొడుకు సాయికుమార్ అడ్డుకున్నాడు. దీంతో గొడవ పెద్దదై తండ్రిని గెంటివేయడంతో అతడి తల గోడకు బలంగా తగులుకుని కింద పడిపోయాడు. ఆ సమయంలో భార్య, ప్రశాంతి గట్టిగా కేకలేశారు. దీంతో సాయికుమార్ వారిద్దరినీ పక్కనున్న గదిలోకి నెట్టి తలుపు గొళ్లెపెట్టి ఇంట్లోని కాయగూరలు కోసే చాకుతో తండ్రి పీక కోసేశాడు. అప్పారావు రక్తపు మడుగులో పడి కొట్టుమిట్టాడుతుండగా సాయికుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈవిషయాన్ని ప్రశాంతి సమీపంలో ఉంటున్న మేనత్త బి.సీతకు ఫోన్ లో సమాచారం అందించింది. హుటాహుటిన సీత అప్పారావు ఇంటికి వెళ్లి చూసే అప్పారావు మృతిచెంది ఉన్నట్టు గుర్తించింది. ఈ మేరకు సీత ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై కారు దగ్ధం

● పరుగులు తీసిన వాహనదారులు

తునిరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా 16వ నెంబరు జాతీయ రహదారి తునిరూరల్ వి.కొత్తూరు వద్ద కదులుతున్న కారులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారు జాతీయ రహదారి మీదుగా పాయకరావుపేట వైపు వెళుతుండగా ఒక్కసారిగా కారులోంచి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి పరుగులు తీయడంతో నిమిషాల వ్యవధిలో మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో జాతీయ రహదారి ఇరువైపులా ప్రయాణిస్తున్న వాహనదారులు భయాందోళన చెంది ఎక్కడ వాహనాలు అక్కడే ఆపేశారు.దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వాహనం తగలపడి ఎగసిపడుతున్న మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఘటనపై తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మాక్ అసెంబ్లీకి శివ రాజేష్ ఎంపిక



సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి పెద్దాపురం నియోజకవర్గ స్థాయిలో మండలంలోని ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గొర్రెల రాజేష్ ఎంపికయ్యాడు. అతడికి హెచ్ఎం, ఉపాధ్యాయులు, మండల విద్యా శాఖాధికారులు అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే కొండబాబు నుంచి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కాకినాడ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో 28 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.28.52 లక్షలు మంజూరయ్యాయి. గురువారం లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, పలివెల రవి, బంగారు సత్యనారాయణ, ఎస్కే రహీం, చింతలపూడి రవి, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, అమలకంటి బలరాం, రెడ్డం సత్తిబాబు, చోడిపల్లి సతీష్, మూగు రాజు, పొంగా బుజ్జి, సంగాని నాగూర్, దేవు జయలక్ష్మి, రిక్కా లక్ష్మి, బత్తు భవాని తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు బాబు



జనసేన కమిటీల ఏర్పాటుపై అభిప్రాయాలు సేకరిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, తుమ్మల బాబు, పెండెం దొరబాబు, మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు ఉంటుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు తెలిపారు. పిఠాపురం బైపాస్ రోడ్డులోని రైస్‌మిల్లర్స్ కల్యాణ మండపంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు మండలంలోని 12 గ్రామాలకు చెందిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కమిటీల ఏర్పాటు నిమిత్తం అభిప్రాయాలు సేకరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలకు అనుగుణంగా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై పరిశీలన జరిపారు. సమావేశంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంఘ నాయకుడు వీరేంద్రకు సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కాకినాడ దక్షిణ మండల అధ్యక్షుడిగా నియమితుడైన బీసీ సంఘ నాయకుడు దొడ్డి వీరేంద్రను గురువారం కొండయ్యపాలెంలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యనమదల రవి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పని అప్పగించినా కష్టపడి పనిచేసే వీరేంద్ర భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి పెంకే రాజు, నాయకులు పెంకే శివ, కాదా శివరామకృష్ణ, దొడ్డి అప్పలరాజు, పాలిక చిన్న, వాసంశెట్టి మహేష్, వాసంశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

సఫాయీ కర్మచారీ నిరుద్యోగ యువతకు సబ్సిడీపై సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా షెడ్యూల్డు కులాల సహకార సంఘం సఫాయీ కర్మచారీ వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు రుణాలకు అవకాశం కల్పిస్తూ ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకంలో సబ్సిడీపై సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను మంజూరు చేస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి తెలిపారు. గతంలో లబ్ధిదారులు రుణ చెల్లింపులో విఫలమైన వాహనాలను షరతుల మేరకు తిరిగి మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు కాకినాడ జనరల్ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ప్రగతి భవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా కార్యాలయంలో స్వయంగా ఇవ్వడం కానీ (లేదా) పోస్టు ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అర్హతలు: ఐదుగురు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడాలి. ప్రతి సభ్యుడు సఫాయీ కర్మచారీ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. సభ్యుల్లో ఒకరికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి రుణం 6శాతం వడ్డీతో 72 నెలసరి వాయిదాల్లో (ప్రతినెలా రూ.33,064 చొప్పున చెల్లించాలి.) మరిన్ని వివరాలకు 6281817023 నెంబరును సంప్రదించాలి.

గొల్లప్రోలు నూతన కమిషనరుగా శ్రీనివాసులు



గొల్లప్రోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీకి ఎట్టకేలకు రెగ్యులర్ కమిషనరు నియమితులయ్యారు. నరసరావుపేట మున్సిపల్ మేనేజరుగా పనిచేస్తున్న పి.శ్రీనివాసులుకు గ్రేడ్-3 మున్సిపల్ కమిషనరుగా ఉద్యోగోన్నతి కల్పించి గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరుగా నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది డిసెంబరు 31న అప్పటివరకు కమిషనరుగా పనిచేసిన రవికుమార్ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి పిఠాపురం మున్సిపల్ కమిషనరు నామ కనకారావు గొల్లప్రోలు ఇన్‌చార్జి కమిషనరుగా ఉన్నారు.

ఈయన అక్టోబరు మొదటి వారంలో అమెరికా వెళ్లేందుకు సెలవు పెట్టడంతో నగర పంచాయతీ ఏఈ అహ్మద్ ఆలీషాకు కమిషనరుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పది నెలలుగా ఇన్‌చార్జిల పాలనలో ఉన్న నగరపంచాయతీకి రెగ్యులర్ కమిషనర్ నియమితులు కావడంతో పాలన గాడిలో పడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

శ్రీచైతన్య కళాశాలలో రక్తదాన శిబిరం



కాకినాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీ బాయి జన్మదినం సందర్భంగా నగరంలోని లక్ష్మీనారాయణనగర్ గల శ్రీచైతన్య కళాశాల సరస్వతీ సౌధం క్యాంపస్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో సుమారు 250 మంది రక్తదానం చేశారు. ఆర్ఐలు గోపీనాథ్, శ్రీనివాస్, రాంబాబు, డీన్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టర్ షాన్ మోహన్‌ని మర్యాద పూర్వ కంగా కలిసి జ్ఞాపిక అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పద్మనాభం

కలెక్టర్‌ని కలిసిన రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యో గుల సంఘం కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు కె.పద్మనాభం గురువారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిశారు. గత నెల 26న జరిగిన స్వర్ణోత్సవ వేడుకలను వివరించి సందేశం ఇవ్వాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి సందేశాన్ని త్వరలో పంపిస్తానన్నారు. పెన్షనర్స్ సంఘ భవనాన్ని దర్శిస్తానని కూడా తెలిపారు. అసోసియేషన్‌కు స్థలం కోసం వివరించగా... ఫైలు తమ దగ్గర ఉందని త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. కలెక్టర్‌ను కలిసి వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పిఠాపురం మండల యూనిట్ సెక్రటరీ డి.సల్మాన్‌రాజు, ప్రసాద్ ఉన్నారు.

'మత్స్యకారులకు నగదు, నిత్యావసరాలు ఇవ్వాలి'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల మత్స్యకారుల వేట నిలిచిపోయినందున ప్రభుత్వం నగదు, నిత్యావసర వస్తువులు ఇవ్వాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ నగర పరిధిలోని దుమ్ములపేట, పర్లోవపేటల్లోని మత్స్యకారులకు నగదుతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన సరుకుల్లో అవకతవకలు జరిగినట్టు అనుమానం కలుగుతోందన్నారు. దీనిపై అధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముందు ప్రకటించిన విధంగా కుటుంబానికి నగదు రూపంలో ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఊరూరా వెళ్లి చేపలు అమ్ముకుంటున్న వారికి కూడా ఆర్థిక సాయం చేయాలని కోరారు. పెద్ద ఎత్తున మత్స్యకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టణంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ విస్తృత ప్రచారం

సామర్లకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం పిలుపుమేరకు ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు నాగ గోవిందు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమగ్రంగా వివరించారు. నాయకులు సుంకవిల్లి బాపిరాజు, జానీమోజెస్, కూనంశెట్టి అర్జునరావు, చుక్క వెంకటరమణ, అమలకంటి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జె.కామ్ సంస్థ పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో నూతన వ్యాపార అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బిజినెస్ నెట్ వర్కింగ్ ఆర్గనైజేషన్ జె.కామ్ సంస్థ ఆధ్వర్యాన కాంపిటేషన్ టు కొలాబ్రేషన్ సమావేశాన్ని వెంకీ రెసిడెన్సీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంస్థ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, టీడీపీ నాయకుడు అమన్‌జైన్, జె.కామ్ సంస్థ టేబుల్ 1, 2, 3 చైర్మన్లు ఎ.శ్రీనివాసరావు, కేవీఆర్ మూర్తి, అల్లు రాధ, సంస్థ కోచ్‌లు శ్రీరామ సుబ్బారావు, ప్రవల్లిక, కాకినాడ అడ్వైజర్ పుల్లిహుడి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలి: డీఈవో

కాకినాడ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 7, 8, 9 తరగతుల పాఠ్య పుస్తకాల్లో పరీక్షల సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని డీఈవో పిల్లి రమేష్ కోరారు. గురువారం ఆయన కాకినాడ సాలిపేటలోని బాలికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల్లో అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయినులు, పీడీలు పాల్గొన్నారు.

మహా సంస్థానంలో సత్యదత్త వ్రతాలు

పిఠాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శుక్రవారం సత్యదత్త వ్రతాలు నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభులకు అభిషేకాలు జరిగాయి. ఆలయ ఈవో సౌజన్య, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీచ్ టూల్ పరిశీలకులకు శిక్షణ

తొండంగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టీచ్ టూల్ పరిశీలకులకు శుక్ర, శనివారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ షేక్ బాబ్జి తెలిపారు. తొండంగి ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పాఠశాలల్లో టీచ్ టూల్ అబ్జర్వేషన్ నిమిత్తం జిల్లాలో శిక్షణ పొందిన అబ్జర్వర్స్‌కు తిరిగి మండలంలో రెండు రోజులు నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇస్తారన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తోటపల్లి సబ్ పోస్టాఫీస్‌కు గ్రహణం

- నెట్‌వర్క్ సమస్యతో ఐదు నెలలుగా సేవలకు బ్రేక్
- ఆర్‌డీ, ఇన్సూరెన్స్ సొమ్ముల కోసం ఖాతాదారుల వెతలు
- పట్టించుకోని పోస్టల్ ఉన్నతాధికారులు



తోటపల్లి సబ్ పోస్టాఫీస్

ఎటపాక, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా ఎటపాక మండలం తోటపల్లి సబ్ పోస్టాఫీస్‌కు గ్రహణం పట్టుకుంది. ఈ పోస్టాఫీసులో గత ఐదారు నెలలుగా నెట్‌వర్క్ సాంకేతిక సమస్యతో కేంద్రప్రభుత్వ సేవలకు ఆటంకం కలుగుతోంది. దీంతో పోస్టాఫీస్ పరిధిలోని పోస్టల్ ఖాతాదారులు ప్రతీరోజు ఇక్కడకువస్తూ ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. తోటపల్లి సబ్ పోస్టాఫీసు పరిధిలో సుమారు 30 గ్రామాల ఖాతాదారులు కేంద్రప్రభుత్వం అందించే అనేకరకాల సేవలను పొందుతున్నారు. ఐదారు నెలలుగా నెట్ వర్కు సమస్యతో పోస్టాఫీసుకు వస్తున్న ఖాతాదారులను నెట్ వర్క్ పనిచేయడంలేదని, వారం, పదిరోజుల తర్వాత రావాలంటూ పోస్టల్ అధికారి తిప్పి పంపేస్తున్నారు. ప్రధానంగా పోస్టాఫీసులో ఆర్‌డీ (రికరింగ్ డిపాజిట్) గడువు ముగిసిన ఖాతాదారులతోపాటు ఇన్సూరెన్స్ స్కీమ్‌లైన రూరల్ పోస్టల్ లైఫ్, పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలు వర్తించిన బాధిత కుటుంబ సభ్యులు నెలలుగా పోస్టాఫీస్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఆర్‌డీలు చెల్లించే ఖాతాదారులు వస్తూ పోతున్నారు. నెలలుగా తిరుగుతున్నామని ఆర్‌డీల గడువు ముగిస్తే తమకు ఆర్‌డీ పథకం దూరమయ్యే అవకాశముందని ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. ఈపోస్టాఫీసులో రెగ్యులర్ పోస్టల్ అధికారిని నియమించకపోవడంతో సమస్యగా మారుతోందని, నెలకొకసారి ఇక్కడకు డిప్యూటేషన్‌పై పోస్టల్ అధికారి విధుల్లోకి వస్తున్నారనే ఖాతాదారులు చెబుతున్నారు. దీంతో వారు విధులు అంకితభావంతో చేయలేక పోతున్నా రనే విమర్శలు ఉన్నాయి. ఇదేకాక పోస్టాఫీసు విధుల్లో సమయపాలన పాటించకుండా ఒక్కోసారి మధ్యాహ్నం సమయంలో పోస్టాఫీసుకు తాళం వేస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ పోస్టాఫీసులో రెగ్యులర్ పోస్టల్ అధికారిని నియమించాలని ఖాతాదారులు కోరుతున్నారు. ఈ విషయమై చింతూరు పోస్టల్ ఐపీవో అబ్దుల్‌ను వివరణకోరగా నెట్‌వర్కు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయంను పోస్టల్ ఎస్పీ దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని లోయర్ సీలేరు ఇంజనీర్‌ను కలిసిన టీడీపీ నాయకులు



జమాల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న ఇంజనీర్ రాజారావు

మోతుగూడెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, చింతూరు టీడీపీ మండల అధ్యక్షుడు మహమ్మద్ జమాల్ ఖాన్ లోయర్ సీలేరు ప్రాజెక్ట్ ముఖ్య ఇంజనీర్ రాజారావుని మోతుగూడెం టీడీపీ నాయకులతో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై విన్నవించినట్లు ఏపీ జెన్కోలో పనిచేస్తున్నటు వంటి గుత్తేదార్ కార్మికులకు అద్దెప్రాతిపాదికన నివాస గృహాలు కేటాయించాలని, అదేవిధంగా ఐదు ఆరు యూనిట్లు కన్స్ట్రక్షన్‌లో భాగంగా లోకల్‌గా ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ముఖ్య ఇంజనీర్ స్పందిస్తూ తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భం గా జమాల్‌ఖాన్ చేస్తున్నటువంటి సామాజిక సేవను గుర్తించి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరిం టెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలకృష్ణ, వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాలా కాలంగా అసంపూర్తిగా మిగిలి ఉన్న అయ్యప్ప స్వాముల నివాస దీక్షా శిబిరాన్ని సందర్శించి అయ్యప్ప స్వాముల అభ్యర్థన మేరకు శిబిరాన్ని పూర్తి చేసే ందుకు జమాల్‌ఖాన్ లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. శ్రీ లక్ష్మీగణపతి దేవాలయానికి మంచినీళ్లు, బోరుబావి కూడా వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మోతుగూడెం ఎంపీటీసీ వేగినాగేశ్వర రావు, కరణం శ్రీను బాబు పాల్గొన్నారు.

పురుగుమందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోవాలి

కూనవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):రైతులు పండించే పంటలకు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి సీహెచ్ దేవి అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా కూటురు గ్రామంలో రైతులకు పంటలకు పిచికారీ చేసే రసాయనాలపై అవగాహన కల్పించారు. రసాయనాలు మానవాళికి ఎటువంటి హానీ లేకుండా చూసుకోవాలన్నారు. అంతేకాకుండా రైతులు రసాయనాలు పిచికారీ చేసేటప్పుడు తప్పనిసరిగా నోటికి, ముక్కుకి ముసుగు తప్పనిసరిగా ధరించాలి అన్నారు. చేతులకు గ్లౌజులు ఉండాలన్నారు. రైతులు తప్పనిసరిగా ఈ నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఏఎస్పీ హేమంత్

ఏఎస్పీగా హేమంత్ బాధ్యతల స్వీకరణ

చింతూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏఎస్పీగా బొడ్డు హేమంత్ గురువారం విధులు స్వీకరించారు. ఆగస్టు 19, 2024 నుంచి ఇప్ప టివరకు చింతూరు ఏఎస్పీగా విధులు నిర్వర్తించిన పంకజ్ కుమార్ మీనా అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషన్ ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయిన విషయం విదితమే.

రంపచోడవరం నియోజకవర్గాన్ని అల్లూరి జిల్లాలోనే కొనసాగించాలి

అడ్డతీగల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలో డి.భీమవరం గ్రామంలో గురువారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడు తూ అల్లూరి సీతారామరాజు జిల్లాని ఏర్పాటు చేయాలని, ఉన్న ఆదివాసీ జిల్లాను విభజించి మరో జిల్లాలో కలపవలసిన అవసరం లేదన్నారు. అల్లూరి జిల్లాను ముక్కలు చేసి రంపచోడవరంను తూర్పుగోదావరిజిల్లాలో కలపటం దుర్మార్గం అన్నారు.

మొంథా తుఫాన్‌తో 13 హెక్టార్లలో పంట నష్టం

దేవీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌తో దేవీపట్నం మండలంలో 13 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. 8 హెక్టార్లలో వరి, 6 హెక్టార్లలో మినుము పంట దెబ్బ తిన్నదన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు. మండలంలో 4549ఎకరాల్లో వరి, 82 ఎకరాల్లో మినుము పంటను రైతులు సాగు చేస్తున్నారని వెల్లడించారు.

నెల్లిపాకలో ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం

ఎటపాక, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో గురువారం బీజేపీ నాయకులు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్ర మంలో భాగంగా ప్రతీఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ కార్యక్రమంను నిర్వహించామన్నారు. అనంతరం ప్రతిఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతీఒక్కరూ స్వదేశీ వస్తువులు కొనుగోలుచేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు నలజాల శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతరం పలువురు బీజేపీలో చేరారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీవీ ప్రసాద్, తెల్లం సమ్మక్క, బీజేపీ నాయకులు మూడే సతీష్‌కుమార్, దుర్గారావు, మడకం వెంకటేష్, కుంజా రమేష్ పాల్గొన్నారు.

ఇల్లు కూలినా అధికారులు పట్టించుకోలేదు

దేవీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలో ఇందుకూరు గ్రామ పంచాయతీ పెద్దరమణయ్యపేట గ్రామం బోరగా రామలక్ష్మి తాటాకిల్లు మొంథా తుఫాన్ కారణంగా మట్టి గోడ నేలమట్టమైంది. గ్రామానికి అధికారులు వచ్చిచూసి చూడనట్టు వెళ్లిపోయారని ఆమె ఆరోపించారు.



ఏలేశ్వరంలో స్వదేశీ వస్తువులను వినియోగించాలని ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

స్వదేశీ వస్తువులను ప్రోత్సహిద్దాం

ఏలేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పిలుపుతో దేశంలో తయారైన వస్తువులను మాత్రమే ఉపయోగించాలని బీజేపీ పట్టణ ప్రవాస్ యోజన ఇన్‌చార్జి గంటా బాలుదొర కోరారు. గురువారం పట్టణలో స్వయం సమృద్ధి భారత్ నినాదంతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు రెడ్డి లోవరాజు, మలిరెడ్డి పాపరాజు, గట్టిం సీతారాం, గట్టిం గంగాధర్, వానపల్లి చినబాబు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, టీడీపీ నాయకులు

అభివృద్ధి పనుల పరిశీలన

జగ్గంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశీలించారు. స్థానిక శెట్టిబలిజ పేటలో జరుగుతున్న డ్రైన్ల పనులను పరిశీలించారు. అనంతరం శెట్టిబలిజపేటలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు. అనంతరం స్థానిక తోటవీధిలోని బ్రహ్మకుమారీస్ జ్ఞాన మందిరాన్ని పరిశీలించారు. దీనికి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోనేటి వద్ద జరుగుతున్న పార్కు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



జగ్గంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో బుధవారం భారత రాజ్యాంగంపై జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఇందుల ప్రకాష్ ప్రతిభ చాటారు. అమరావతిలో ఈనెల 24న జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ప్రకాష్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థిని కళాశాల అధ్యాపకులు, పలువురు విద్యార్థులు అభినందించారు.

రాచపల్లి అరుణాచల ఆలయంలో పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ లోవలక్ష్మి, తదితరులు

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో కార్తీక బహుళ పాడ్యమి సందర్భంగా గురువారం దక్షిణామూర్తి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అలాగే అరుణాచలేశ్వర స్వామి, అపీత కుచాంబమ్మవారికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. హంస దక్షిణామూర్తి హోమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల పల్లకీ సేవలో మాజీ జడ్పీటీసీ ఎం.లోవలక్ష్మి, మురళీరాజు దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- జడ్జి ఎల్.గోపినాథ్



ప్రత్తిపాడు కోర్టులో న్యాయ అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జడ్జి గోపినాథ్

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు జడ్జి ఎల్.గోపినాథ్ కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈనెల 9న నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా ఈఅవగాహన సదస్సు నిర్వహించామన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారం సులభతరం అవుతాయన్నారు. న్యాయవాదులను సమకూర్చుకోలేని పేదలకు ప్రభుత్వం న్యాయవాదిని సమకూరుస్తుందని గోపినాథ్ వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ప్యానల్ అడ్వకేట్లు బుగత శివ, దేవి, కె.సూర్యప్రకాశరావు, బంగుశూరి మధు బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్ఐలు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తుని రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం తొండంగి మండలానికి చెందిన పలు గ్రామాల వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడారు. అనంతరం తొండంగి మండలం హక్కుంపేట, రామారావు పేట, కొత్తపేట గ్రామాలకు చెందిన వందలాది మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరగా వారికి ఆయన పార్టీ కండు వాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గిరికిన తాతబ్బాయి, మైలిపల్లి బాబూరావు, వంకా చిట్టిబాబు, కోడా పాముయ్య, బొంది చంద్రరావు, కోడా అర్జున్, ఎర్రిపల్లి శ్రీను, యజ్జల సతీష్, చొక్కా కొండయ్యతో పాటు వందలాది మంది కోన ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, టీడీపీ తొండంగి, తుని, కోటనందూరు మండలాల అధ్యక్షులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

సోమేశ్వరరావుకు సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డు

గండేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కార్యాలయాధికారిగా పనిచేస్తున్న శంఖారావం, తెలుసుకుందామా అంతర్జాల పక్షపత్రిక సంపాదకుడు జి.సోమేశ్వరరావుకు 2025 ఏడాదికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డు లభించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన్ను ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రవితంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ విభాగాల డీన్లు, ఆఫీస్ సిబ్బంది అభినందించారు.

తాత్కాలికంగా వంతెన పనులు

ఏలేశ్వరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా అన్నవపాలెం వంతెన పూర్తిగా కుంగిపోయింది. దీంతో సుంకర సుబ్బారావు వంతెనకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఈవంతెన పైనుంచి నిత్యం ప్రజలు, పాఠశాలల, కళాశాలల విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. గురువారం వంతెనపై మోటార్ సైకిల్, బాటసారులు ప్రయాణించేందుకు వంతెన కుంగిన చోట మట్టివేసి గోతులను పూడ్చారు. వంతెన పనులను కౌన్సిలర్ అలమండ చలమయ్య పర్యవేక్షించారు. బూర్లు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



అప్పనపాలెం వంతెనకు తాత్కాలిక పనులు చేపడుతున్న కౌన్సిలర్ చలమయ్య

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

గండేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సుబ్బయమ్మపేట గ్రామంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా రామాలయం వద్ద భక్తులు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శివలింగం, ఓంకారం తదితర ఆకారాల్లో దీపాలు వెలిగించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా దీపాలతో కనువిందు చేసింది.



సుబ్బయమ్మపేటలో వెలిగించిన కార్తీకదీపాలు

అంగన్‌వాడీ సెంటర్‌కు కుర్చీలు బహూకరణ

గండేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యల్లమిల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి యల్లమిల్లి జెట్టి గ్రానైట్స్ అధినేత శివకుమార్ 25 కుర్చీలు బహూకరించారు. త్వరలో అంగన్‌వాడీకి ఫ్యాన్లు, పుస్తకాలు పెట్టునేందుకు బీరువాలు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

చలమలశెట్టి సునీల్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త చలమలశెట్టి సునీల్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పరామర్శించారు. సునీల్ తండ్రి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సురేంద్రనాథ్ ఆకస్మిక మృతితో గురువారం ఎమ్మెల్యే సత్యప్రభ మచిలీపట్నం వెళ్లి చలమలశెట్టి కుటుంబాన్ని పరామర్శించారు. డాక్టర్ సురేంద్రనాథ్ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ సురేంద్రనాథ్ వైద్య వృత్తిని ఉపాధిలా కాకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించారని కొనియాడారు. ఆమె వెంట ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, టీడీపీ జిల్లా నాయకుడు పర్వత సురేష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, అంబటి రాంబాబు, చెక్కపల్లి నవీన్, ముప్పనబోయిన ఏసుబాబు, తదితరులు ఉన్నారు.



సురేంద్రనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా

ప్రత్తిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రభుత్వ ఆదుకోవాలని అన్నమయ్య కళా క్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు కోరారు. నాటక సమాజాన్ని దేవదాయ శాఖ, ప్రజలు ప్రోత్సహించాలన్నారు. ధర్మవరంలో రాజరాజేశ్వరి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో చతుర్థి సప్తాహ మహోత్సవాలు గురువారం రాత్రితో ముగిశాయి. ఈసందర్భంగా కళాకారులు, సప్తాహ దాతలు, సామాజిక సేవా తత్పరులను సప్తాహ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో నూకరాజు నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా హైందవ సాంస్కృతి, సంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని కళాప్రదర్శనలు, భజనల ద్వారా పరిరక్షించే కళాకారులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కాకినాడ ఎస్వీరంగారావు కళా పరిషత్ ఉపాధ్యక్షుడు గళ్నా పద్మారావు, సీనియర్ కళాకారులు దొడ్డి పట్ల సోమన్న దొర, సేవారత్న అవార్డు గ్రహీత రాయుడు దొర బాబు, వేదపండితులు టి.పాపారావు, సూర్యం, మల్లిపూడి డాక్టర్ రామకృష్ణ, బొల్లు రాజబాబు, హార్మోనిస్ట్, మృదంగం కళాకారులు మాదేపల్లి వెంకటేశ్వరరావు, మృదంగం విద్యాంసులు వీరబాబు, బాబి, కళాకారులు తాతీలు, సూరిబాబు, తడారి శ్రీనులను సప్తాహ కమిటీ ఘనంగా సన్మానించింది. ఆదర్శ ప్రిన్సిపాల్ దాడి చిన్నారావు, వర్తక సంఘం అధ్యక్షుడు తోపాటి బాబూరావు, సీనియర్ కళాకారుడు దళే కామరాజు, తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో కళాకారులు, సేవాతత్పరులకు సన్మానం చేస్తున్న దృశ్యం

'పేదలను ఆదుకునేందుకే ట్రస్టు ఏర్పాటు'



బాధితురాలికి నగదు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ ముదునూరి

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకునేందుకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టును స్థాపించానని ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు చెప్పారు. ధర్మవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఈగల పార్వతిని గురువారం ఆయన పరామర్శించారు. వైద్యఖర్చుల కోసం రూ. ఐదు వేలు అందించారు. నియోజకవర్గంలో నిరుపేదలను వైద్యపరంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు, తోపాటి బాబ్జీ, గదుల సూర్యనారాయణ, ఈగల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురి చేరిక



జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

కిర్లంపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగపతినగరంలో వైసీపీ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు జనసేన పార్టీలో గురువారం చేరారు. వైసీపీ నేత దాడి చిన్న బుజ్జి ఆధ్వర్యంలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సమక్షంలో 500 మంది వరకు చేరారు. వీరికి రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రమేష్ మాట్లాడుతూ కూటమిని మరింత బలోపేతం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బెండపూడి ఫీడర్‌పై ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం శుక్ర, శనివారాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ వీరభద్రరావు తెలిపారు. బెండపూడిలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం వరకు సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

విద్యుత్‌శాఖ సేవలపై ప్రశంసలు

అన్నవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి గిరిప్రదక్షిణ సమయంలో విద్యుత్‌శాఖ అన్నవరం సెక్షన్ ఉద్యోగుల సేవలపై గ్రామంలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అదనపు సిబ్బందితో పర్యవేక్షణ చేశారు. భక్తులకు మజ్జిగ పంపిణీతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఏఈ ప్రసాదరావు, లైన్‌మన్ కె.రాంబాబు తదితరులు ఆయా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాలబాలికలు తమ హక్కులు తెలుసుకోవాలి

శంఖవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల బాలికలు తమ హక్కులు తెలుసుకోవాలని సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు-2025లో భాగంగా గురువారం బాల బాలికలకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శంఖవరంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీల నుంచి 15 మంది విద్యార్థులకు ఒకరోజు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల సంరక్షణ అధికారి జే.విజయ మాట్లాడుతూ ప్రతీఏటా నవంబరు 14 నుంచి 20 వరకు అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.కిషోర్, తహసీల్దార్ తాతారావు, ఎంఈవో ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మానిపండు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మానిపండు తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. గురువారం పొలంబడిలో భాగంగా రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం పంట పూతదశ, పాలు పోసుకునే దశలో ఉన్నందున ప్రాపికొనజోల్ మిల్లీలీటరు లేదా కార్బండిజం రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో పిచికారి చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ పద్ధతులు, నిల్వలో నష్టనివారణ చర్యలు గురించి వివరించారు. ఏఈవో శ్రీనివాస్, రైతులు, రైతుసేవా కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గిరిప్రదక్షిణ విజయవంతం

అన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి గిరిప్రదక్షిణ సిబ్బంది సమష్టి కృషితోనే విజయవంతమైందని ఈవో వీర్ల సుబ్బారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. పోలీసులు, మీడియా తమవంతు పాత్రపోషించారని, చైర్మన్ రోహిత్ విలువైన సలహాలు ఇచ్చారని కొనియాడారు. ప్రత్యేకాధికారి త్రినాథరావు అనుభవం, పర్యవేక్షణతో గిరిప్రదక్షిణ విజయవంతమైందన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలకు అభినందనలు



ప్రత్తిపాడు టాలెంట్ టెస్ట్ విజేతలను అభినందిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలను గురువారం అఖిల్ విద్యా సంస్థల అధినేత వినకోటి గంగాధర్ అభినందించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో సీనియర్స్ విభాగంలో అఖిల్ విద్యా సంస్థల విద్యార్థులు రెండో బహుమతి సాధించారు. వీరిని సంస్థ అధినేత గంగాధర్, ప్రిన్సిపాల్ వినకోటి సునీత, స్కూల్ ఇన్‌చార్జి రెడ్నం నాగశ్రీ, టీచర్ లక్ష్మణ్, తదితరులు అభినందించారు.